క్లుప్తంగా

బర్కా కృష్ణ జన్మదిన వేడుకలు

ముషీరాబాద్: బీసీసేన జాతీయ అధ్యక్షుడు బర్కా కృష్ణ జన్మదినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆదివారం విద్యానగర్‌లోని బీసీభవన్‌లో బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య ఆధ్వర్యంలో కేక్ తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా బీసీ చైతన్య సదస్సులు నిర్వహించి సామాజిక వర్గంలో రాజకీయ చైతన్యం నింపాలని ఆయన సూచించారు. బీసీసేన రాష్ట్ర అధ్యక్షులు బూరుగుపల్లి కృష్ణ యాదవ్, విద్యార్థి సంఘం అధ్యక్షుడు జిల్లపల్లి అంజి, మద్దూర్ వెంకటేష్‌యాదవ్, నిరంజన్ యాదవ్, కృష్ణ మధు, సందీప్, వేణు తదిత రులున్నారు.

6న బీఆర్‌ఎస్ కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనం

కాచిగూడ: బీఆర్‌ఎస్ కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమాన్ని ఈ నెల 6న నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో నిర్వహిస్తున్నట్లు గడ్డం గంగాధర్ యాదవ్ ఫౌండేషన్ చైర్మన్, బీఆర్‌ఎస్ నేత గడ్డం శ్రీనివాస్ యాదవ్ ప్రకటించారు. ఆదివారం కాచిగూడలో బీఆర్‌ఎస్ పార్టీ కాచిగూడ డివిజన్ ఇన్‌చార్జి డాక్టర్ బద్దుల శిరీష ఓంప్రకాష్‌యాదవ్‌తో కలిసి ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా కళాకారులతో ధూంధాం సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశామని, ముఖ్యఅతిథిగా మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ పాల్గొంటారన్నారు. పార్టీ కార్యకర్తలు, నేతలు పాల్గొని ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

దేవీ నవరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు

అంబర్‌పేట: గోల్నాక దుర్గానగర్‌లో దేవీ నవరాత్రుల ఉత్సవాల ఏర్పాట్లను పెద్ద ఎత్తున చేపడతామని దుర్గానగర్ మైసమ్మ అమ్మవారి ఆలయ కమిటీ అధ్యక్షుడు కె.దుర్గప్రసాద్ తెలిపారు. ఆదివారం ఆలయ ప్రాంగణంలో కమిటీ కార్యవర్గ సమావేశంలో ఉత్సవాల ఏర్పాట్లపై ప్రత్యేక సమావేశం జరిగింది. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేస్తామన్నారు. ఆలయ కమిటీ ఉపాధ్యక్షులు ప్రభాకర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఏనుగంటి నరేందర్, నాయకులు పర్వతాలు, శంకర్, రమణ, గోపాల్, ఆంజయ్య తదితరులున్నారు.

ఆరోగ్యంపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి


ఉచిత వైద్య శిబిరంలో రమేష్‌రెడ్డి, నిరంజన్‌రెడ్డి తదితరులు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ఆరోగ్యంపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాకర్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ సెంట్రల్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్.రమేష్‌రెడ్డి, పి.వి.నిరంజన్‌రెడ్డిలు తెలిపారు. ఆదివారం ప్రతిమా ఆసుపత్రి కాచిగూడ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆరోగ్యమే మహాభాగ్యమని వాకర్స్ తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి రోజూ వాకింగ్ చేయాలని సూచించారు. వాకర్స్ క్లబ్ ముఖ్య సలహాదారులు వెంకటకృష్ణారావు, కోశాధికారి డాక్టర్ సునీల్, మాజీ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, రత్నాకర్‌రెడ్డి, పద్మానరేష్, శ్రీదేవి, కృష్ణ తదితరులున్నారు.

భక్తి శ్రద్ధలతో మిలాద్ ఉన్ నబీ వేడుకలు

అంబర్‌పేట్: మిలాద్ ఉన్ నబీ సంబరాలు భక్తి శ్రద్ధలతో జరిగాయి. ఆదివారం అంబర్‌పేట నియోజకవర్గ వ్యాప్తంగా ముస్లింలు మిలాద్ ఉన్ నబీ వేడుకలను ఘనంగా నిర్వహించుకున్నారు. తురాబ్‌నగర్‌లో జరిగిన వేడుకలకు మాజీ కార్పొరేటర్ పద్మావతిరెడ్డి ఇతర బీఆర్‌ఎస్ నాయకులు హాజరయ్యారు. పలువురు ముస్లిం యువత భారీ ర్యాలీ నిర్వహించారు.
ముషీరాబాద్: మిలాద్ ఉన్ నబీ పండుగ సందర్భంగా ముషీరాబాద్ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ జహంగీర్‌యాదవ్ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీని నిర్వహించారు. సెంట్రల్ జోన్ డీసీపీ ఎం.వెంకటేశ్వర్లు, అడిషనల్ డీసీపీ విజయ్‌కుమార్, యాదగిరి, ఏసీపీ, బీఆర్‌ఎస్ యువనాయకుడు ముఠా జైసింహ, రాంనగర్ డివిజన్ బీఆర్‌ఎస్ అధ్యక్షులు రావులపాటి మోజెస్, భోలక్‌పూర్ అధ్యక్షుడు వై.శ్రీనివాస్, శివముదిరాజ్, మహమ్మద్ అలీ, శ్రీధర్‌చారి, ఎయిర్‌టెల్ రాజు తదితరులున్నారు.

అంధ విద్యార్థులకు ఫ్యాన్‌ల పంపిణీ

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: దేవనార్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అంధ విద్యార్థులకు రూ. లక్ష విలువ చేసే ఫ్యాన్‌లను పంపిణీ చేసినట్లు ఆ సంస్థ ప్రతినిధులు మురళీకృష్ణ, చక్రపాణి, రామనందం తెలిపారు. సామాజిక సేవలో భాగంగా తాము సేవా కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. సంస్థ ప్రతినిధులు నవీన్, శాంతి, విశ్వనాథం, ఆర్.మురళీకృష్ణ, సతీష్, పద్మ, వసంత, శ్రీదేవి, సంపత్‌రెడ్డి, మాధవరావు, ప్రసాద్, శ్రీనివాస్ ఉప్పల, నారాయణమూర్తి తదితరులున్నారు.

ప్రత్యర్థి ఎవరైనా భారీ మెజార్టీతో గెలుస్తా !

అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్



కాచిగూడ: వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో అంబర్‌పేట నియోజకవర్గం నుంచి ప్రత్యర్థి ఎవరైనా పరవాలేదని, తన విజయం నల్లేరుపై నడకేనని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ ధీమా వ్యక్తం చేశారు. ఆదివారం కాచిగూడ బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. గత ఎన్నికల్లో అంబర్‌పేట నుంచి 1016 ఓట్ల మెజార్టీతో గెలిచానని, ఈసారి మాత్రం ప్రజల మద్దతుతో బంపర్ మెజార్టీ సాధిస్తానని ఆశాభావం వ్యక్తం చేశారు. అంబర్‌పేట అభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం పనిచేస్తున్నానన్నారు. నిరంతరం ప్రజల మధ్యే ఉంటూ.. వారి సమస్యలు తెలుసుకుని పరిష్కరిస్తున్నానన్నారు. తన సెల్‌ఫోన్ నెంబర్ నియోజకవర్గ ప్రజలందరికీ తెలుసునని, 24 గంటలు ఫోన్ తనవద్దే ఉంటుందన్నారు. ఇంట్లో ఉంటే ఉదయం 5:30 నుంచే ఇంటి వద్ద జాతర లాగా ప్రజలు తమ సమస్యలు చెప్పుకోవడానికి వస్తుంటారన్నారు. క్యాంపు కార్యాలయంలో ఉంటే రాత్రి 10, 11 గంటల వరకు వస్తూనే ఉంటారని తెలిపారు.

- అంబర్‌పేటలో 3వేల మందికి డబుల్ బెడ్రూం ఇళ్లను ఉచితంగా పంపిణీ చేశామని, మరో 3వేల మందికి గృహలక్ష్మి పథకాన్ని వర్తింపజేశామన్నారు.
- సుమారు 4వేల మందికి రూ.20 కోట్లకు పైగా సీఎంఆర్‌ఎఫ్ పథకం కింద పేద ప్రజల ఆసుపత్రుల ఖర్చుల నిమిత్తం చెక్కులను అందజేశామన్నారు.
- ఇటీవల ముసారాం బ్రిడ్జి పనులకు శంకుస్థాపన, అంబర్‌పేటలో ముస్లిం గ్రేవియార్డ్‌కు శంకుస్థాపన, కాచిగూడలో కర్ణాటక సాహిత్యమందిర్ పునర్నిర్మాణం కోసం రూ.5 కోట్లు మంజూరు చేయించడం జరిగిందన్నారు.
- నారాయణగూడలో రూ.15కోట్లతో నిర్మించిన మోడల్ రైతు మార్కెట్‌ను త్వరలోనే ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు.
- బాగ్ అంబర్‌పేటలో హిందూ శ్మశానవాటిక అభివృద్ధి పనులను ప్రారంభించామని చెప్పారు. పార్టీలకు అతీతంగా అర్హులందరికీ కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను అందజేశామన్నారు. గతంలో ఏ ఎమ్మెల్యే చేయలేనన్ని అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజా సంక్షేమ పథకాలను అంబర్‌పేటలో చేపట్టామన్నారు. తాను చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలే తన విజయానికి దోహదపడతాయన్నారు.


భూమన్నలేన్‌లో డ్రైనేజీ పైపులైన్ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాలేరు

అభివృద్ధి పనులు ప్రారంభం

కాచిగూడ: అభివృద్ధి, సంక్షేమమే ప్రధాన ధ్యేయంగా పనిచేస్తున్నామని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. కాచిగూడ డివిజన్‌లోని బర్కత్‌పుర భూమన్నలేన్, లింగంపల్లి రాఘవేంద్రస్వామి టెంపుల్‌లేన్‌లో రూ.20 లక్షల వ్యయంతో చేపట్టనున్న డ్రైనేజీ పైపులైన్ నిర్మాణ పనులకు ఆదివారం స్థానిక కార్పొరేటర్ కన్నె ఉమారమేష్‌యాదవ్‌తో కలిసి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా అధికారులు, సిబ్బంది, బీఆర్‌ఎస్ నేతలతో కలిసి ఆయన పాదయాత్ర నిర్వహించి, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ.. కాలనీల్లో సమస్యలు లేకుండా సీవరేజ్ పైపులైన్ల ఆధునీకరణ, సీసీరోడ్లు, బీటీ రోడ్లు, తాగునీటి పైపులైన్ల ఏర్పాటు తదితర పనులు చేపడుతున్నామన్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తక్షణ చర్యలు చేపడుతున్నామని తెలిపారు. కాలనీలు, బస్తీల్లో మౌలిక వసతుల కల్పనతో పాటు, ప్రజా సమస్యలను గుర్తించి పరిష్కరిస్తున్నామని వివరించారు. బీఆర్‌ఎస్ నేతలు డాక్టర్ బద్దుల శిరీష ఓంప్రకాష్‌యాదవ్, ఎర్ర భీష్మదేవ్, దిడ్డి రాంబాబు, దాత్రిక్ నాగేందర్ బాబ్జీ, కె.సదానంద్, పెంట రమేష్, కృష్ణాగౌడ్, సునీల్ బిడ్లాన్, బద్దుల శ్రీకాంత్, మహేష్, విజయ్, బీజేపీ నేతలు సుభాష్ పటేల్, బీమ్‌రాజ్, ఎస్.రవియాదవ్, మల్లికార్జున్, ఎస్ఎస్ రాము తదితరులున్నారు.

హిందూ సంస్కృతిపై ప్రజల్లో అవగాహన

కాచిగూడ: హిందూ సంస్కృతి, సంప్రదాయాలపై ప్రజల్లో మరింత అవగాహన పెంపొందించేందుకు ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని దేవాదాయ ధర్మాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ ఎ.బాలాజీ అన్నారు. కాచిగూడ తుల్జాభవన్ ధర్మశాలలో ఆదివారం ఏర్పాటు చేసిన దూప, దీప, నైవేద్య అర్చకుల పునఃశ్చరణ తరగతులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న దేవాలయాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని, ఆ దిశగా అర్చకులకు దూప, దీప, నైవేద్యం కింద ప్రతినెలా రూ.10వేలు అందిస్తుందన్నారు. హైదరాబాద్, సికింద్రాబాద్, రంగారెడ్డి జిల్లా పరిధిలో ఎంపిక చేయబడిన ఆలయాల పూజారులను గుర్తించి వారికి మన సంస్కృతి, సంప్రదాయాలు, పూజా విధానాల పట్ల అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. ప్రజల్లో దైవభక్తిని పెంపొందించే విధంగా భక్తులు ఆలయాలకు వచ్చి పూజలు చేస్తూ.. మన సంస్కృతి, సంప్రదాయాలను తెలుసుకునే విధంగా అర్చకులు కృషి చేయాలని సూచించారు. ఈ శిక్షణ తరగతులు ఈ నెల 3వ తేదీ వరకు కొనసాగుతాయన్నారు. దేవాదాయ, ధర్మాదాయశాఖ సికింద్రాబాద్ అసిస్టెంట్ కమిషనర్ కృష్ణ, రంగారెడ్డి జిల్లా అసిస్టెంట్ కమిషనర్ శేఖర్, తుల్జాభవన్ ఈఓ అంజనారెడ్డి తదితరులున్నారు.



బీఈడీ మెరిట్ అభ్యర్థులకు ఉద్యోగాలు ఇవ్వాలి


ధర్నా చేస్తున్న డీఎస్సీ-2008 మెరిట్ అభ్యర్థులు

ముషీరాబాద్: డీఎస్సీ- 2008 ఎస్‌జీటీలో నష్టపోయిన బీఈడీ మెరిట్ అభ్యర్థులకు వెంటనే ఉద్యోగాలు ఇవ్వాలని డీఎస్సీ - 2008 బీఈడీ మెరిట్ అభ్యర్థుల అసోసియేషన్ అధ్యక్షుడు ఉమామహేశ్వర్‌రెడ్డి , ప్రధాన కార్యదర్శి జయప్రకాష్, జాయింట్ సెక్రెటరీ శ్రీనివాస్ చావ్లా రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం ఇందిరాపార్కు ధర్నా చౌక్ వద్ద అసోసియేషన్ ఆధ్వర్యంలో సీఎం కేసీఆర్ డీఎస్సీ 2008 ఎస్‌జీటీలో నష్టపోయిన బీఈడీ మెరిట్ అభ్యర్థులకు ఉద్యోగాలు ఇస్తామని 2016 వరంగల్ బహిరంగ సభలో ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ.. సత్యాగ్రహ దీక్ష చేపట్టారు. వారు మాట్లాడుతూ... ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో డీఎస్సీ 2008 ఎస్‌జీటీ (సెకండరీ గ్రేడ్ టీచర్స్) నోటిఫికేషన్ ప్రకారం సెలక్ట్ అయ్యి ఉద్యోగం రాక నష్టపోయిన బీఈడీ అభ్యర్థులకు తీరని అన్యాయం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. పక్క రాష్ట్రానికి చెందిన ఏపీ అభ్యర్థులకు ఆ రాష్ట్ర ప్రభుత్వం టైమ్ స్కేల్ విధానంతో 2021 జూలైలో ఎస్‌జీటీ ఉద్యోగాలు కల్పించిందని, రాష్ట్ర ప్రభుత్వం స్పందించి ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని వారు సీఎం కేసీఆర్‌ను కోరారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని లేని పక్షంలో తమ ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అసోసియేషన్ ప్రతినిధులు మహేందర్‌రెడ్డి, బాపూరెడ్డి, రమేష్, వెంకన్న, చంద్రశేఖర్, నరేష్, కృష్ణవేణి, విజయలక్ష్మి, సుజాత తదితరులున్నారు.

హైకోర్టు తీర్పును అమలు చేయాలి..

ముషీరాబాద్: ఇందిరాపార్కు వద్ద హైకోర్టు ఇచ్చిన తుది తీర్పును అమలు చేసి ఉద్యోగాలు ఇవ్వాలని కోరుతూ.. బీఎస్సీ- 2008 అభ్యర్థులు సత్యాగ్రహ దీక్ష చేపట్టారు. ఈ ధర్నాలో జిల్లాతో పాటు వివిధ జిల్లాల నుంచి వందల సంఖ్యలో వచ్చిన అభ్యర్థులు సత్యాగ్రహదీక్ష నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. గత 13 ఏళ్లుగా తాము న్యాయపోరాటం చేస్తున్న ప్రభుత్వం కనికరించడం లేదని, హైకోర్టు తీర్పు ఇచ్చినా.. అమలు చేయకపోవడం శోచనీయమన్నారు. ప్రగతిభవన్, వరంగల్ సభలో ఇచ్చిన హామీని సీఎం కేసీఆర్ నిలబెట్టుకోవాలన్నారు. ఉమామహేశ్వర్‌రెడ్డి, కొక్కుల శ్రీనివాస్, సాయిరెడ్డి తదితరులున్నారు.

ప్రతి ఒక్కరూ స్వచ్ఛత పాటించాలి


స్వచ్ఛతలో పాల్గొన్న బీజేపీ నేత సూర్యప్రకాష్‌సింగ్

కాచిగూడ: పరిసరాల పరిశుభ్రతను ప్రతి ఒక్కరూ పాటించాలని బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా కోశాధికారి ఎ.సూర్యప్రకాష్‌సింగ్ అన్నారు. స్వచ్ఛభారత్‌లో భాగంగా ఆదివారం కాచిగూడ డివిజన్ రాజేంద్రనగర్ కాలనీలో స్థానిక ప్రజలతో కలిసి ఆయన రోడ్లను ఊడ్చి పరిసరాలను శుభ్రం చేశారు. ప్రతి ఒక్కరూ స్వచ్ఛత పాటించేలా ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఆరోగ్యవంతమైన సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. బీజేపీనేతలు ఉదయ్, రవి, శ్రీకాంత్, రమ్య, సునిత, ఉమ, దేవి, పద్మశ్రీ, రాజేష్, శ్రీనివాస్, రాము, శ్రీధర్, సురేష్, తదితరులున్నారు.

వినతిపత్రం అందజేత

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: బాగ్‌లింగంపల్లిలోని హెచ్‌ఐజీలో ఎమ్మెల్యే ముఠా గోపాల్ పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికులు పలు సమస్యలను పరిష్కరించాలని ఆయనకు వినతిపత్రం అందజేశారు. డ్రైనేజీ, చెత్త తదితర అంశాలపై ఎమ్మెల్యే స్థానికులతో చర్చించారు. ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకోవడంతో పాటు వాటికి శాశ్వత పరిష్కారం చూపిస్తామని హామీ ఇచ్చారు. బబ్లూ, డివిజన్ అధ్యక్షులు రావులపాటి మోజెస్, ప్రధాన కార్యదర్శి ఎం.దామోదర్‌రెడ్డి, ముచ్చకుర్తి ప్రభాకర్, వివేక్ తదితరులున్నారు.

భక్తిశ్రద్ధలతో మాసోత్సవం

నల్లకుంట: టీఆర్టీకాలనీలో గల కుసుమ హరనాథ ఆశ్రమంలో మాసోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదివారం కుసుమ హరనాథులకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులచే నిర్వహించిన భజన కార్యక్రమం ఆకట్టుకుంది.

అర్హులందరికీ డబుల్ బెడ్రూం ఇళ్లు

ముషీరాబాద్: అర్హులైన పేదలందరికీ డబుల్‌బెడ్రూం ఇళ్లు ప్రభుత్వం అందజేస్తుందని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. ఆదివారం ముషీరాబాద్ డివిజన్‌లో 38 మంది అర్హులైన పేదలకు డబుల్ బెడ్రూం ఇళ్లు మంజూరు కావడంతో లబ్ధిదారులు, గౌరీశంకర్ ఆలయ కమిటీ చైర్మన్ శ్రీధర్‌చారిలు సంయుక్తాధ్వర్యంలో ఎమ్మెల్యేను సన్మానించారు. ఆయన మాట్లాడుతూ.. ఇప్పటివరకు ముషీరాబాద్ నియోజకవర్గంలో 2593 మంది లబ్ధిదారులకు డబుల్ బెడ్రూం ఇళ్లు అందజేశామన్నారు. త్వరలో మరికొంత మంది దరఖాస్తు దారులకు సైతం డబుల్ బెడ్రూం ఇళ్లను అందజేయనున్నట్లు ప్రకటించారు. ముషీరాబాద్ బీఆర్‌ఎస్ నాయకులు ముచ్చకుర్తి ప్రభాకర్, శివముదిరాజ్, ప్రశాంత్, శ్రీనివాస్, పరుశురాంయాదవ్, మహిళా కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు శోభ, మేరీ, ఉమా తదితరులున్నారు.

వరల్డ్ ఓపెన్ వాటర్‌పిన్ స్విమ్మింగ్‌లో గోల్డ్ మెడల్


క్వీనీ విక్టోరియా

కాచిగూడ: యూరప్ ఖండంలోని సెరిబియా దేశ రాజధాని బెల్‌గ్రేన్‌లో జరిగిన వరల్డ్ ఓపెన్ వాటర్ పిన్ స్విమ్మింగ్ చాంపియన్ షిప్ పోటీలలో భారత్ తరపున పాల్గొన్న హైదరాబాద్, కాచిగూడకు చెందిన క్వీనీ విక్టోరియా గోల్డ్ మెడల్, సిల్వర్ మెడల్ సాధించారు. సెప్టెంబర్ 24 నుంచి 30వ తేదీ వరకు జరిగిన ఈ స్విమ్మింగ్ చాంపియన్‌షిప్ పోటీలలో పాల్గొన్న ఆమె 3 కిలో మీటర్ల మోలోపిన్‌లో గోల్డ్ మెడల్, ఒక కిలోమీటర్ మోలోపిన్‌లో సిల్వర్ మెడల్ సాధించి భారత కీర్తి పతాకాన్ని నలు దిశల చాటి చెప్పారు. ప్రపంచ వ్యాప్తంగా 17 దేశాలు పాల్గొనగా.. గోల్డ్ మెడల్ సాధించిన తొలి భారతీయురాలిగా ఆమె రికార్డు నెలకొల్పారు. ఈ పతకాలను రెండు తెలుగు రాష్ట్రాల ప్రజలకు అంకితం చేస్తున్నానన్నారు.

ఏడు భాషల్లో 30 గంటల గీతాలాపన


రికార్డును అందజేస్తున్న సినీనటుడు సుమన్

చిక్కడపల్లి: గాయని నాగరత్నం 30 గంటలపాటు ఏడు భాషల్లో నిరాటంకంగా పాటలు పాడి రికార్డు సృష్టించారు. నాగశ్రీ సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో త్యాగరాయగానసభ ప్రధానహాల్‌లో శనివారం ఉదయం ప్రారంభమైన ఈ కార్యక్రమం ఆదివారం రాత్రి వరకు నిర్వహించారు. ఇంటర్నేషనల్ వండర్ బుక్ ఆఫ్ రికార్డు, జీనియస్ బుక్ ఆఫ్ రికార్డ్, గోల్డ్‌స్టార్ వరల్డ్ రికార్డ్, ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్, డైమండ్ వరల్డ్ రికార్డ్, భారత్ వరల్డ్ రికార్డ్‌ల ప్రతినిధులు ఈ సందర్భంగా రికార్డులను నాగరత్నానికి అందజేశారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ప్రముఖ సినీనటుడు సమన్ మాట్లాడుతూ.. 30 గంటల పాటు పాడటం సహనంతో కూడుకున్న ప్రక్రియగా అభివర్ణించారు. బంగి నరేందర్‌గౌడ్, విజయలక్ష్మి, సుభాషిణి, బీవీ నాగు, దేవేందర్ బండారి, రాధ పాల్గొన్నారు.

ప్రైవేటు సెక్యూరిటీ గార్డుల నూతన కమిటీ

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: తెలంగాణ ప్రైవేటు సెక్యూరిటీ గార్డ్స్, అలైడ్ వర్కర్స్ యూనియన్ నూతన సమన్వయ కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో రాష్ట్ర కన్వీనర్‌గా యాటల సోమన్న, కమిటీ సభ్యులుగా కె.ఈశ్వర్‌రావు, శ్రవంతి, సత్యనారాయణ, శ్రీకాంత్, రవికుమార్, రామకృష్ణ, రామారావు, సాంబయ్యతో పాటు మరో 10 మందిని ఎన్నుకున్నారు.

రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి

కాచిగూడ: రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన కాచిగూడ రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. రైల్వే హెడ్ కానిస్టేబుల్ సమ్మయ్య తెలిపిన వివరాల ప్రకారం.. కాచిగూడ రైల్వేస్టేషన్ సమీపంలో గుర్తుతెలియని వ్యక్తి (45) పట్టాలు దాటుతుండగా.. రైలు ఢీకొని మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. రైల్వే పోలీసులు కేసును దర్యాప్తు చేస్తున్నారు.

చేయిచేయి కలుపుదాం.. స్వచ్ఛత సాధిద్దాం

అంబర్‌పేట్/ ముషీరాబాద్ జోన్ల పరిధిలో 'స్వచ్ఛతా హీ సేవ' కార్యక్రమాన్ని ప్రజలు పెద్ద ఎత్తున చేపట్టారు. ఆదివారం ప్రజా ప్రతినిధులు పరిసరాలను స్వయంగా శుభ్రం చేసి స్వచ్ఛత ప్రాముఖ్యాన్ని వివరించారు.


స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమంలో డాక్టర్ మనోజ్‌రెడ్డి, డాక్టర్ పద్మజ


స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్


డీడీ కాలనీలో బీజేపీ జాతీయ నాయకులు మురళీధర్‌రావు


కవాడిగూడ డివిజన్ అడ్వకేట్స్ కాలనీలో..


రోడ్లను శుభ్రం చేస్తున్న ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్

బీసీలంతా ఐక్యంగా ఉద్యమించాలి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: బీసీ రిజర్వేషన్ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టేందుకు చర్యలు చేపట్టేందుకు దేశవ్యాప్తంగా బీసీలంతా ఐక్యంగా ఉద్యమించాల్సిన సమయం ఆసన్నమైందని సామాజిక న్యాయ జేఏసీ అధ్యక్షుడు ప్రొఫెసర్ ప్రభంజన్‌యాదవ్ అన్నారు. ఆదివారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో 2023–24 లోపు శాసనసభ, పార్లమెంటు స్థానాల్లో బీసీలకు రిజర్వేషన్‌లు సాధించాలనే సంకల్పంతో 101 మంది మేధావులు, సామాజిక-రాజకీయ ముఖ్యులతో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పలు డిమాండ్లను వారు ఆమోదించారు. బీసీ రిజర్వేషన్లు సాధించుకునేందుకు ఉద్యమాన్ని మరింత బలోపేతం చేయాలని తీర్మానించారు. వంగా రాములుగౌడ్, మేకపోతుల నరేందర్‌గౌడ్, బత్తుల సిద్దేశ్వర్, నాగేష్‌ముదిరాజ్, ప్రొఫెసర్ అన్వర్‌ఖాన్, వెన్నెపూజ పరుశురాజ్, సోగరా బేగం, దాసోజు లలిత, రాజానేతా, ఆకుల పద్మ, నాగుల శ్రీనివాస్‌యాదవ్, దత్తాత్రేయ, నిమ్మల వీరన్న, బాలాజీ నాయక్, మేడి రమణ తదితరులున్నారు.

మున్నూరుకాపు మహిళలకు టికెట్లు కేటాయించాలి


మాట్లాడుతున్న డాక్టర్ కొండా దేవయ్య, బండారు లత

కాచిగూడ: వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో మున్నూరు కాపు మహిళలకు సీట్లు ఇవ్వాలని మున్నూరుకాపు సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కొండ దేవయ్య ప్రధాన రాజకీయ పార్టీలను డిమాండ్ చేశారు. మున్నూరుకాపు సంఘం మహిళా విభాగం గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షురాలు బండారి లత అధ్యక్షతన ఆదివారం నారాయణగూడలో జరిగిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. అన్ని రంగాల్లో మహిళలు స్వశక్తితో రాణిస్తున్నా.. రాజకీయాల్లో మాత్రం మహిళలను ఎదగకుండా అన్ని పార్టీలు అణగదొక్కుతున్నాయని ఆరోపించారు. మహిళా బిల్లుకు రాష్ట్రపతి ఆమోదం లభించినప్పటికీ 33 శాతం రిజర్వేషన్ల అమలు ఆలస్యమయ్యే అవకాశం ఉన్నందున వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ఆయా రాజకీయ పార్టీలు మహిళలు అందిస్తున్న సేవలను గుర్తించి టికెట్లు కేటాయించాలన్నారు. మహిళలను నిర్లక్ష్యం చేయొద్దని ముఖ్యంగా బీఆర్‌ఎస్, కాంగ్రెస్, బీజేపీ పార్టీలను ఆయన కోరారు. ఆర్.వీ.మహేందర్, హరికృష్ణ, వెంకటేశ్వర్లు, బాలకృష్ణ, నిరంజన్, శివ, ఆకుల విక్రమ్‌కుమార్, కొండలరావు, సురేష్‌కుమార్, ఆకుల సుకన్య, సదాలక్ష్మి, శీలం మమత తదితరులున్నారు.

భగత్‌సింగ్ విగ్రహావిష్కరణ


భగత్‌సింగ్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న కవి, రచయిత రాజ్‌లింగం

నల్లకుంట: దేశంకోసం ఉరి తాడును ముద్దాడిన భగత్ సింగ్ గొప్ప దేశ భక్తుడని ప్రముఖ కవి, రచయిత సంగీతపు రాజ్‌లింగం అన్నారు. గాడ్గేబాబా దళిత సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ స్వామి అల్వాల్ తన సొంత ఖర్చులతో నల్లకుంట సంజీవయ్యనగర్‌లో అంబేడ్కర్ శతాబ్ధిభవన్‌లో భగత్ సింగ్ విగ్రహాన్ని ఏర్పాటు చేయించారు. ఆదివారం ఆయన విగ్రహ ఆవిష్కరణ సభ జరిగింది. దీనికి హాజరైన రాజ్‌లింగం, స్వామి అల్వాల్‌తో కలిసి భగత్‌సింగ్ విగ్రహాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. భగత్‌సింగ్ వీర మరణం వృధా కాలేదని, ఎంతో మంది యువకులను భారత స్వాతంత్రోద్యమం వైపు మరలించిందన్నారు. డాక్టర్ స్వామి అల్వాల్ సంజీవయ్య నగర్‌లో గల తన 300 గజాల ఇంటి స్థలంలో అంబేడ్కర్ శతాబ్ధిభవనాన్ని నిర్మించి, అందులోనే డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, సంత్ గాడ్గేబాబా, చాకలి ఐలమ్మ, స్థల దాతల విగ్రహాలతో పాటు మొత్తం 17 మంది దేశోద్ధారకుల విగ్రహాలను ఏర్పాటు చేయించడం ఆయన సేవా నిరతికి నిదర్శనమన్నారు. ఎరుకల మహేందర్, రంగుల వేణు, నిర్మల, శంకర్, హర్షవర్ధన్, బాలు, వీరస్వామి, రమేష్, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

పసుపు బోర్డు, గిరిజన యూనివర్సిటీ ప్రకటన హర్షనీయం

నల్లకుంట: రాష్ట్ర పర్యటనకు వచ్చిన ప్రధాని నరేంద్ర మోదీ మహబూబ్‌నగర్ సభలో మాట్లాడుతూ.. తెలంగాణ రైతుల కోసం పసుపు టెర్మినల్ బోర్డు, పసుపు రైతుల సంక్షేమం కోసం జాతీయ పసుపు బోర్డు ఏర్పాటు చేయనున్నట్టు ప్రకటించడంపై తెలంగాణ బ్రాహ్మణ ఎంప్లాయీస్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ అధ్యక్షుడు అన్నావజుల సూర్యప్రకాష్ హర్షం వ్యక్తం చేశారు. ములుగు జిల్లా కేంద్రంలో సమ్మక్క, సారక్క పేరుతో సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీ ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించడం పట్ల ఆయన ప్రధానికి కృతజ్ఞతలు తెలిపారు.

ప్రతీ ఇంటికి సంక్షేమ పథకాలు చేర్చిన ఘనత కేసీఆర్‌దే


చెక్కును అందజేస్తున్న డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్

సికింద్రాబాద్: కులమతాలకు అతీతంగా ప్రతీ ఇంటికి సంక్షేమ పథకాలు చేర్చిన ఘనత సీఎం కేసీఆర్ ప్రభుత్వానికే దక్కిందని డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్ అన్నారు. సికింద్రాబాద్ నియోజకవర్గానికి చెందిన పలువురికి మంజూరైన కల్యాణలక్ష్మి, షాదీముబారక్, సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల ఆదివారం ఆయన అందజేసి మాట్లాడారు. గతంలో ఏ ప్రభుత్వ హయాంలో అమలు జరగని పథకాలు బీఆర్‌ఎస్ హయాంలో కొనసాగుతున్నాయన్నారు. సికింద్రాబాద్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశామని, ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు సామల హేమ, కంది శైలజ, లింగాని ప్రసన్నలక్ష్మి, బీఆర్‌ఎస్ నేతలు కిషోర్ గౌడ్, రామేశ్వర్‌గౌడ్, కరాటే రాజు, లింగాని శ్రీను, పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లో చేరికలు..

అడ్డగుట్టకు చెందిన వివిధ పార్టీల నేతలు, వడ్డెర సంఘం సభ్యులు ఆదివారం డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉద్యమ నాయకుడిగా వ్యవహరించిన రోజు నుంచే సీఎం కేసీఆర్‌కు ప్రజా సంక్షేమం పట్ల పూర్తి ఆలోచన ఉందని తెలిపారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పరిపాలనను సాగిస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో తీసుకెళ్తున్నారన్నారు. బలదేవ్‌రాజ్, బాలరాజ్, శివకుమార్, నరసింహ, కుమార్, స్వామి, రాజు, బాబు బీఆర్‌ఎస్‌లో చేరారు.